# CLCI BIBLE COLLEGE

Christianpet - NIDUBROLU

## అపోస్తలుల విశ్వాస ప్రమాణము (Apostles Creed)

### మొదటి అంశము - తండ్రియైన దేవుడు (The First Article)

"భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను."

### దీని అర్థమేమి? (What does it means?)

దేవుడు నన్నును, సమస్త జీవరాసులను కలుగజేసి, నాకు శరీరాత్మలకును, కన్నులను, చెవులను, మొదలైన సకలావయవములను, బుద్ధిని, సమస్త ఇంద్రియములను దయచేసి వానిని కాపాడుచున్నాడని నమ్ముచున్నాను. ఇంతేకాక జీవమునకు కావలసినదంతయు, అనగా వస్త్రములను, అన్నపానాదులను, ఇల్లు ఆవరణమును, భార్య పిల్లలను, పొలము, పశువులను మొదలైన సమస్త వస్తువులను ఆయన నాకు దయచేసి అనుదినము నా అక్కరలను తీర్చుచు, సకలాపాయములనుండి నన్ను తప్పించి, కీడులన్నిటి నుండి నన్ను కాపాడి రక్షించుచున్నాడని నమ్ముచున్నాను. ఆయన ఇవి యావత్తు నా పుణ్యమునుబట్టియు, నాయోగ్యతను బట్టియు గాక తండ్రి భావముగల దైవ ప్రేమవలనను, కృపవలనను దయచేయుచున్నాడు. కాబట్టి నేను ఈ సమస్తమును గూర్చి ఆయనకు కృతజ్ఞత అగుపరచి, ఆయనను స్తుతించి, సేవించి, ఆయనకు లోబడుటకు బద్ధుడనై యున్నానని నమ్ముచున్నాను. ఇది వాస్తవమే.

### రెండవ అంశము - కుమారుడైన క్రీస్తు (The Second Article)

"ఆయన ఏక కుమారుడును, మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మ వలన గర్భమున ధరింపబడి, కన్యయైన మరియకు పుట్టి పొంతిపిలాతు అధికారము క్రింద శిలువ వేయబడి, చనిపోయి, సమాధిచేయబడెననియు, అదృశ్యలోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవదినమున తిరిగిలేచి పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడి చేతివైపు కూర్చుండి యున్నాడనియు సజీవులకును మృతులకును తీర్పు చేయుటకు అక్కడనుండి వచ్చుననియు నమ్ముచున్నాను."

### దీని అర్థమేమి? (What does it means?)

తండ్రి నుండి అనాదియందు పుట్టిన నిజమైన దేవుడును, మరియ అను కన్యనుండి పట్టిన నిజమైన

మానవుడైన యేసుక్రీస్తు నా ప్రభువైయున్నాడని నమ్ముచున్నాను. తప్పిపోయి శిక్షకు విధింపబడిన మనుష్యుడైన నన్ను ఈయన వెండి, బంగారముల చేతగాక, వెలలేని తన పరిశుద్ధ రక్తము చేతను, తాను పొందిన నిరపరాధ శ్రమ మరణములచేతను, సమస్త పాపముల నుండియు, మరణమునుండియు, సాతాను అధికారమునుండియు విమోచించి, రక్షించి నన్ను సంపాదించుకొనెను. మరియు ఆయన మరనమునుండి లేచి నిరంతరము జీవించుచు పరిపాలించుటనుబట్టి, నేనును ఆయన వాడనై ఆయన రాజ్యములో ఆయనతో జీవించుచు, నిత్యమైన నీతిని, నిర్దోషత్వమును, మోక్షానందమును కలిగిన వాడనై ఆయనను సేవించుటకు ఆయన ఇదంతయు చేసెనని నమ్ముచున్నాను. ఇది వాస్తవమే.

## ***మూడవ అంశము - పరిశుద్ధాత్మ*** (The Third Article)

"పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను, పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు శరీర పునరుత్థానమును నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను. ఆమెన్"

## ***దీని అర్థమేమి?*** (What does it means?)

నేను నా స్వబుద్ధివలనైనను, స్వశక్తివలనైనను, నాప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచి ఆయన యొద్దకు చేరనేలేనుగాని, పరిశుద్ధాత్మ సువార్తవలన నన్ను పిలిచి, తన వరముల వలన నన్ను వెలిగించి, నిజమైన విశ్వాసమందు నన్ను పరిశుద్ధపరచి, కాపాడుచున్నాడని నమ్ముచున్నాను. ఈలాగుననే ఈయన భుమిమీదనున్న సమస్త క్రైస్తవ సంఘమును పిలిచి, తన చెంత చేర్చి, వెలిగించి, పరిశుద్ధపరచి, నిజమైన ఏకవిశ్వాసమందు యేసుక్రీస్తునొద్ద కాపాడుచున్నాడు. ఈయన ఈ సంఘములో నా యొక్కయు, విశ్వాసులందరి యొక్కయు సమస్తపాపములను అనుదినము సంపూర్ణముగా మన్నించుచు అంత్యదినమునందు నన్నును, చనిపోయినవారినందరిని లేపి, నాకును క్రీస్తునందు విశ్వాసముంచు వారందరకును నిత్యజీవము దయచేయునని నమ్ముచున్నాను. ఇది వాస్తవమే.

